పూడికతీతకు రూ.65 లక్షలు

- పనులకు 27 శాతం లెస్‌లో టెండర్
- ఒకే కాంట్రాక్టర్‌కు నాలుగు జోన్లు



నిజామాబాద్‌నాగారం: చిన్నపాటి వర్షాలకే నగరమంతా జలమయంగా మారుతోంది. ఎక్కడిక్కడ ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడుతోంది. పెద్ద పెద్ద మురుగుకాలువలు అన్నీ అస్తవ్యస్తంగా మారాయి. చిన్న చిన్న డ్రైనేజీల్లో నీరు సక్రమంగా వెళ్లడం లేదు. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే చాలు నగర ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ శాఖ బడ్జెట్‌లో పూడికతీత పనులకు ప్రతి ఏడాది సుమారుగా రూ.65 లక్షల నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులతో నగరంలోని మురుగుకాలువల్లో పూడికతీత పనులు చేపడుతారు. ఈ ఏడాది మాత్రం ఒకే కాంట్రాక్టర్ నాలుగు జోన్‌లు 27 శాతం లెస్‌లో దక్కించుకున్నారు.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ నగరంలో 60 డివిజన్‌లు, 3.99 లక్షల జనాభా ఉంది. 6 జోన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో జోన్‌లో పూడికతీత పనులకు రూ.8 లక్షల వరకు నిధుల కేటాయించారు. నాలుగో జోన్ చాలా పెద్దది కావడంతో రూ. 25లక్షల నిధులు కేటాయించారు. మొత్తం రూ.65 లక్షల నిధులతో మే, జూన్, జూలై నెలలో పూడికతీత పనులు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పూర్తి చేశారు. నాలుగు జోన్‌లకు ఒకే ఒక్క కాంట్రాక్టర్ అది కూడా 27 శాతం లెస్‌లో దక్కించుకోవడంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తుంది. లెస్‌లో పనులు దక్కించుకుంటే పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా పాటిస్తారని అనుమానాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి ఏడాది పూడికతీత పనులు జరుగుతూనే ఉన్నాయి. సుమారు రూ.65 లక్షల వరకు నిధులు కేటాయింపులు జరుగుతునే ఉన్నాయి. లెస్‌లో పనులు జరిగితే మున్సిపల్‌కే లాభం చేకూరుతుంది. కాంట్రాక్టర్ లెస్‌లో పనులు దక్కించుకోవడం వల్ల నాణ్యతలేని పనులు జరుగుతాయని నగరవాసులు చెబుతున్నారు. తూతూ మాత్రంగా పూడికతీత పనుల వల్ల నగర ప్రజలకు మళ్లీ ఇబ్బందులు పునరావృతం కాక తప్పదంటున్నారు.

నగరంలోని కాలువల పరిస్థితి:	
పక్కాగా ఉన్న కాలువలు	450కిలో మీటర్లు
కచ్చా కాలువలు	220కిలో మీటర్లు
వరద కాలువలు	15కిలోమీటర్లు

కాలువలు సక్రమంగా లేకపోవడమే కారణం..

శివారుకాలనీలు ఆటోనగర్, ధర్మపురిహిల్స్, నాగారం, అర్సపల్లి, చంద్రశేఖర్‌కాలనీ, గౌతంనగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకే కాలనీల్లో నీరు వచ్చి చేరుతుంది. కాలువలు సక్రమంగా లేకపోవడమే ప్రధాన కారణం. డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ చాలా చోట్ల అస్తవ్యస్థంగా ఉంది. డీ–54 కెనాల్ కబ్జాలతో చిన్న కాలువలా మారిపోయింది. నగరం బస్టాండ్, ఖలీల్‌వాడీ, రైల్వేకమాన్, పూలాంగ్, బోధన్ రోడ్ తదితర ప్రాంతాల్లో వర్షాలు పడితే చాలు చెరువులు, కుంటలు తలపించేలా నీరు నిల్వ ఉంటోంది.

నాణ్యత పాటించాల్సిందే

పూడిక తీత పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. కాంట్రాక్టర్లు తూతూ మాత్రంగా పనులు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. వర్షాల వల్ల నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు పూడిక తీత పనులు చేపడుతున్నాం.

– మురళి మోహన్, ఇంజనీరింగ్ ఈఈ

క్లుప్తంగా

హనుమాన్ మందిర నిర్మాణానికి ఆర్థిక సాయం

ఇందల్వాయి: డొంకల్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హనుమాన్ మందిర నిర్మాణానికి ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నగదు రూపంలో ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు.

మజ్జిగ పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని పులాంగ్ చౌరస్తాలో బీజేపీ ఐటీ సెల్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డివిజన్ నాయకులు మీసేవ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజల దాహాన్ని తీర్చే విధంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, నాయకులు క్రాంతి, రఘునాథ్, సునీత్, మున్నా గౌడ్, అక్షయ్ పటేల్, సాయి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి

ఇందల్వాయి: మండలంలోని మన ఊరు–మన బడి పనులు, చంద్రాయన్‌పల్లి గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం, పలు తండాలను కలుపుతూ వేయాల్సిన బీటీ రోడ్డు పనులపై స్థానిక ఎంపీపీ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు రూరల్ ఎమెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను గురువారం కలిశారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పూర్తయిన పనులను ప్రారంభించాలని విన్నవించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీహెచ్ దాసు, ఉప సర్పంచ్ ప్రకాష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్‌లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్ సహకార షుగర్ ఫ్యాక్టరీను రైతులకు అప్పగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ గురువారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని ఇచ్చారు. భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి, షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ కొండెం సాయారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు న్యూఢిల్లీలో ఎంపీ అర్వింద్‌ను కలిసి షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి వివరించి ఫ్యాక్టరీ 1995 యాక్టులో వాటాదారు రైతులకు అప్పగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు చామకూర సూర్యారెడ్డి, కోశాధికారి జనగం భూమారెడ్డి, జిల్లా యువ ప్రముఖ్ కే సాయినాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఖలీల్‌వాడి: సమ్మె చేస్తున్న జేపీఎస్, వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సమ్మె శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సమ్మెను ప్రభుత్వం అణగదొక్కేందుకు కుట్ర పన్నుతోందన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికులు, ఆశా వర్కర్లతో వ్యవహరించిన ధోరణిని ఇప్పుడు జేపీఎస్‌లపై ప్రయోగిస్తుందన్నారు.

చౌడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



డిచ్‌పల్లి: సాంపల్లిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు పెరుగుతున్న మద్దతు



బతుకమ్మలను పేర్చి ప్లకార్డు పట్టుకొని నిరసన తెలియజేస్తున్న జేపీఎస్‌లు

బతుకమ్మలను పేర్చి నిరసన

సుభాష్‌నగర్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు పెరుగుతోంది. నగరంలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరుకుంది. గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ గైక్వాడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు మోతె సాయన్న, జిల్లా ఉపాధ్యక్షుడు కె శివానంద్ సమ్మె శిబిరాన్ని సందర్శించి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా రాంచందర్ గైక్వాడ్ మాట్లాడుతూ.. జేపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. ప్రొబేషన్ పిరియడ్‌ను ఎత్తేసి రెగ్యులర్ చేయాలన్నారు. అదేవిధంగా జేపీఎస్‌లు బతుకమ్మలను పేర్చి తమ నిరసనను తెలియజేశారు.

సంఘీభావం తెలిపిన ప్రజాపంథా నేతలు

ఖలీల్‌వాడి: జేపీఎస్‌ల సమ్మెకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చౌక్ వద్ద దీక్షా శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడం సరైనది కాదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

ఖలీల్‌వాడి: జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని, వీపీవోలకు వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ అన్నారు. గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జేపీఎస్‌లను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేయాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయికి బానిసవుతున్న యువతకు కౌన్సిలింగ్ ఇచ్చి సరైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు. యువత ఊరి చివరలో ఉన్న నిర్మానుష్య ప్రదేశాలలో గంజాయి సేవిస్తున్నారని, ఆ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మీర్ మాజిద్, మందుల పోశెట్టి, మీసాల రవి, హబీబ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ నుంచి డొంకేశ్వర్‌కు బస్సు వేయండి

డొంకేశ్వర్(ఆర్మూర్): కొత్తగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలానికి ఆర్మూర్ నుంచి నేరుగా ఆర్టీసీ బస్సును వేయాలని బీజేపీ సీనియర్ నాయకులు మారంపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ నుంచి వయా వన్నెల్(కె), మారంపల్లి, నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాల మీదుగా మండల కేంద్రం వరకు బస్సును నడిపితే బాగుంటుందన్నారు. ఈ విషయం ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించామని, త్వరగా స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

ఎన్ఎస్ఎఫ్ ఆస్తుల అమ్మకం నిలిపేయాలి

బోధన్: నిజాం షుగర్ ఫ్యాక్టరీ(ఎన్ఎస్ఎఫ్)కి చెందిన ఇనుప స్తంభాలు, ఇతర సామగ్రిని కోర్ కమిటీ చేపట్టిన అమ్మకాలను నిలిపి వేయాలని ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఉపేందర్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి గురువారం డిమాండ్ చేశారు. లే ఆఫ్ నాటి నుంచి తమకు వేతనాలు చెల్లించడంలేదని, ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఇదివరకు స్క్రాప్ అమ్మిన డబ్బులను వేతనాల కింద కార్మికులకు చెల్లించాలని కోరారు.

బీజేపీతో పెట్టుకుంటే తరిమి కొడతాం



మొలకెత్తిన ధాన్యాన్ని చూపెడుతున్న నేతలు

ఎడపల్లి(బోధన్) : తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామన్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదని కడుపు మండి రైతులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే, దానికి కారణం బీజేపీ నాయకులంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడిన తీరును ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు కమలాకర్ రెడ్డి తప్పుబట్టారు. బీజేపీ నాయకులతో పెట్టుకుంటే తరిమి కొడతామని ఆయన హెచ్చరించారు. గురువారం ఠాణాకలాన్ శివారులో మొలకెత్తిన ధాన్యంను పరిశీలించి ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీలు చించగానే నిజం దాగదని, తడిసిన ధాన్యాన్ని కొంటాం అంటూ ఎడపల్లి మండల కేంద్రం సాక్షిగా బోధన్ ఎమ్మెల్యే చేసిన ప్రకటన నిజం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకటన చేసిన నాటి నుంచి ఇంత వరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదంటూ ఫ్లెక్సీల ద్వారా తాము ప్రశ్నించిన దాంట్లో తప్పేముందని అడిగారు.

'మై ఆటో సేఫ్'పై అవగాహన



ఖలీల్‌వాడి: మై ఆటో సేఫ్ అప్లికేషన్‌లో ఆటోల యజమానులు వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని దుబ్బలో ఆటో యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో యజమానులు, డ్రైవర్‌లు మై ఆటో సేఫ్ అప్లికేషన్‌లో కూడా ఆటో వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రజలకి మీ ఆటోలో ప్రయాణం చేయటానికి నమ్మకం కలుగుతుందని చెప్పారు. సంబంధించిన పత్రాలను పోలీస్ స్టేషన్‌లో సమర్పించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో మెరిసిన తిర్మన్‌పల్లి అక్కా చెల్లెళ్లు



విద్యార్థినులు కొలాస్ శ్రేయ, కొలాస్ శరణ్య

నిజామాబాద్ సిటీ: ఇంటర్ పరీక్షల్లో నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. తిర్మన్‌పల్లికి చెందిన సాయిలు, లతల కుమార్తెలు కొలాస్ శ్రేయ, కొలాస్ శరణ్యలు హైదరాబాద్‌లోని మియాపూర్ ఎస్ఆర్ఐ కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో శ్రేయ బైపీసీ 990 మార్కులు సాధించగా, శరణ్య ఎంపీసీ మొదటి సంవత్సరంలో 466 మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సమాచారం..

నేడు యానంపల్లికి ఆర్టీసీ చైర్మన్ రాక

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లికి శుక్రవారం టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రానున్నారని జెడ్పీటీసీ దాసరి ఇందిర, సర్పంచ్ గోపు చిన్నుబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొంటారన్నారని తెలిపారు. అలాగే డిచ్‌పల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తారని తెలిపారు.

వాటా సొమ్ము చెల్లించండి

మాక్లూర్: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా ప్రభుత్వ సబ్సిడీ పోను ప్రతి లబ్ధిదారుడు రూ.43 వేల 750 నెఫ్ట్ ద్వారా చెల్లించాలని మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే వెల్లడించారు. గురువారం చిన్నాపూర్‌లో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారుల వాటా చెల్లింపులో ఇప్పటికే చాలా జాప్యం జరిగిందన్నారు. పశు వైద్యురాలు ఉమా సహెర్, ఎంపీటీసీ సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఇద్దరు వార్డు సభ్యుల రాజీనామా

నందిపేట్(ఆర్మూర్): తల్వేద గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్‌కు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. తల్వేద గ్రామానికి చెందిన 3వ వార్డు మెంబర్ సీతాల నర్సుబాయి, 12వ వార్డు మెంబర్ మంచిర్యాల నర్సయ్యలు తమ పదవులకు రాజీనామా చేశారు. బుధవారం 8వ వార్డు సభ్యురాలు సిర్నాపల్లి లత సైతం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెల్సిందే.. వారందరూ సర్పంచు, ఉప సర్పంచులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో వార్డు సభ్యులు ముగ్గురు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొనడం మండలంలో చర్చనీయాంశమైంది.

రైతులకు పరిహారమిచ్చే దమ్ముందా..?



చెక్కులు అందజేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి కనీసం రూ.15 వేల చొప్పున పరిహారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పించే దమ్ము బీజేపీ నాయకులకు ఉందా అని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రశ్నించారు. గురువారం రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ రూరల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని, నష్టపోయిన ప్రతి రైతుకు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించేందుకు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం పథకాలు ప్రవేశపెట్టలేదని, కానీ సీఎం కేసీఆర్ ఆడపడుచులకు అండగా ఉంటూ వారి పిల్లల పెళ్లిళ్లకు రూ.1,00,116ను మేనమామ కట్నంగా అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, కోర్వ లలిత, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, నాయకులు ప్రేమ్‌దాస్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



లిటిల్ హార్ట్స్ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి: పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణ శాతం సాధించిన లిటిల్ హార్ట్స్ విద్యార్థులను గురువారం టీఎస్‌ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. , చదువుల్లో రాణిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి వారి తల్లి దండ్రులకు మరింత మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐసీడీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ ఉన్నారు.



అభినందిస్తున్న చైర్మన్ నర్సయ్య

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

సిరికొండ: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని సత్యశోధకు పాఠశాలలో పదవ తరగతిలో మంచి గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు లింగం, గంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల నిరసనకు మద్దతుగా ఉద్యమిద్దాం

ఖలీల్‌వాడి: ఢిల్లీలో నిరసన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఉద్యమిద్దామని హెచ్‌ఆర్‌ఎఫ్, పీవోడబ్ల్యూ మహిళ నేతలు సరిత, అరుణ, సుజాత అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. అంతర్జాతీయ పోటీల్లో పథకాలను సాధించిన మహిళా రెజ్లర్లను, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై రెండు వారాలుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మహిళా రెజ్లర్లపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. బీజేపీ ప్రభుత్వం నేరస్తులకు బాసటగా నిలవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు గొర్రెపాటి మాధవరావు, సీపీఐ నాయకులు రాజన్న, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అజారుద్దీన్, ఫరూక్‌తో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకమిటీ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణ బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కన్వీనర్‌గా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను, మిగితా శాఖల నుంచి సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు.

ప్రతి పౌరునికి 'రాజ్యాంగం' అందజేయాలి



డిచ్‌పల్లి: భారత రాజ్యాంగం గ్రంథాన్ని ప్రతి పౌరునికి ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు సుభాష్ మహరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిచ్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ మహరాజ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం అందజేయడం వల్ల హక్కులు, చట్టాలపై వారికి అవగాహన ఏర్పడుతుందన్నారు. డీఎస్‌పీ మండల ఉపాధ్యక్షులు మోహన్ మహరాజ్, ప్రధానకార్యదర్శి దాసు మహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,750	వెండి (కిలో)	78,300
22 క్యారెట్స్	57,858	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	10	క్యాప్సికం	30	50
బెండకాయ	20	40	గాజరుగడ్డ	20	30
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	35	60	గోబిగడ్డ	10	20
వంకాయ	20	40	గోబిపువ్వు	20	40
పాలకూర	50	70	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	70
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– కస్టడీ– 10.30,1.25,4.20, 7.20,10.15
స్క్రీన్–2– సంగీతం స్కూల్–10.40,7.30; విరూపాక్ష–1.35,10.30; ఉగ్రం –4.30
స్క్రీన్–3 – కేరళ స్టోరీ(హిందీ)–1.45,7.15; ఛత్రపతి (హిందీ)–4.40,10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– ది కేరళ స్టోరీ(హిందీ)–10.10, 7.20,10.20; గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (ఇంగ్లీష్)– 4.05
స్క్రీన్–2– కస్టడీ–10.00,1.10,4.20 ,7.30, 10.40
స్క్రీన్–3– ఛత్రపతి(హిందీ)–11.00,7.05; కథ వెనుక కథ–1.45; ఐబీబీ71(హిందీ)–4.25; భువన విజయం–9.50
స్క్రీన్–4– సంగీతం స్కూల్–10.30,7.50; ఫర్హానా –1.20 –పొన్నియిన్ సెల్వన్–2–4.20; ఉగ్రం–10.40

దేవి	కస్టడీ
నటరాజ్	ఉగ్రం
లలితామహల్	రామబాణం
విజయ్	విరూపాక్ష